
క్లుప్తంగా

భారీ వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇంటి పైకప్పు

దొర్నిపాడు: మండలంలో చాకరాజు వేముల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీకి చెందిన ఇంటి పైకప్పు శనివారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. వర్షం కురుస్తుండంటంతో కుటుంబమంతా వరండాలో నిద్రిస్తున్నారు. తెల్లవారు జామున ఇంట్లో శబ్దం రావడంతో తలుపులు తెరచి చూడగా ఇంటి పైకప్పు కూలిందని వాపోయాడు. ఇంట్లో సామగ్రి, ధాన్యం పూర్తిగా మట్టిలో కూరుకు పోయాయని వాపోయాడు.

నేటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం నుంచి చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. మే 15వ తేదీ వరకు 21 రోజుల పాటు విశేషంగా ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో సమస్త మానవాళికి శుభాన్ని కలగజేయడం కోసం జగన్నాథ స్వామి వారికి వైశాఖ సుద్ధ అక్షయ తృతీయ నుంచి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. స్వామి వారికి చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నిత్య నైవేద్యం సేవలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు ఉత్సవాల్లో పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: మండలంలోని పెద్దనంతపురం గ్రామంలో సేవాలాల్ మరెమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.70 వేలు విరాళం అందజేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విరాళ మొత్తాన్ని దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రషీద్, పట్టణఅధ్యక్షుడు సయ్యద్‌మీర్, విజయచౌదరి, పువ్వాడ భాస్కర్, సుల్తాన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, దువసిపల్లె గ్రామానికి చెందిన ఉప్పల శివకుమార్ (32)అనే వ్యక్తి పాముకాటుకు గురై చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపిన వివరాల మేరకు.. శివకుమార్ డోజర్ నడుపుతూ జీవనోపాధి సాగిస్తున్నాడు. అందులో భాగంగా పారుమంచాల గ్రామానికి చెందిన శీను పొలాన్ని డోజరుతో చదును చేయటానికి ఆపరేటర్‌గా వచ్చాడు. ఈనెల 17న పొలాన్ని డోజరుతో చదును చేసిన అనంతరం సమీపంలోని బుడంతోట్ల వాగులో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకొనేందుకు వెళ్లాడు. వాగులో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉప్పల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నిధుల మంజూరు

జూపాడుబంగ్లా: పి.లింగాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతుల నిమిత్తం రూ.2లక్షలను జిల్లా పరిషత్ ఉమెన్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, పగిడ్యాల జెడ్పీటీసీ పుల్యాల దివ్య మంజూరు చేశారని సర్పంచ్ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం శిథిలమైన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లగా..వెంటనే రూ.2లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో కేంద్రానికి త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

లెనిన్‌కు నివాళి

నందికొట్కూరు: లెనిన్ జయంతి సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆశీర్వాదం ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్‌ను స్ఫూర్తిని తీసుకోవాలని కోరారు. నాయకులు గోపాల్, ప్రేమరాజు, వెంకటేశ్వరగౌడ్, గోవింద్, శేఖర్, మునిస్వామి, రాజు, కిరణ్, మౌలాలి, పండు పాల్గొన్నారు.

5.4.మి.మీ.వర్షపాతం

జూపాడుబంగ్లా: శనివారం తెల్లవారుజామున మండలంలోని వివిధ గ్రామాల్లో 5.4 మి.మీ. వర్షపాతం నమోదైందని ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలో మిడుతూరులో అత్యధికంగా 8.6 మి.మీ., పగిడ్యాలలో అత్యల్పంగా 1.2 మి.మీ. నమోదైందని చెప్పారు. పాములపాడులో 5.4 మి.మీ., నందికొట్కూరులో 4.6 మి.మీ., వెలుగోడులో 3.8 మి.మీ., నమోదైందని వివరించారు.


ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు.


నంద్యాలలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


ఆళ్లగడ్డ ఈద్గాలో..


శిరివెళ్ల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ప్రత్యేక ప్రార్థనలు చేపట్టిన ముస్లింలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఖురాన్ సందేశాన్ని వినిపించిన మౌలానాలు


భీమవరం రస్తాలోని ఆల్‌ఫుర్ఖాన ఈద్గాలో అల్లా సందేశాన్ని వినిపిస్తున్న మౌలానా

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ముస్లింలు రంజాన్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల కఠిన ఉపవాసం తర్వాత జరుపుకొనే ఈద్–ఉల్–ఫితర్ పండుగ ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంజాన్ మాసంలో నమాజ్, జకాత్, రోజాలను త్రికరణ శుద్ధిగా ఆచరించారు. మసీదులు, ఈద్గాల వద్ద వేలాది మంది ముస్లింలు పవిత్ర ఈద్–ఉల్–ఫితర్ రంజాన్ ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలింగనం చేసుకొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక ఎస్సార్బీసీ రస్తాలోని థయిబా ఈద్గా, భీమవరం రస్తాలోని ఆల్‌ఫుర్ఖానా ఈద్గా, సాయిబాబానగర్ ఖుబ్రా ఈద్గా, బొమ్మలసత్రం ఈద్గా, శాంతిరాం మెడికల్ కళాశాల వద్ద సున్నీ ఈద్గా, దేవనగర్ తదితర ఈద్గాలలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. మౌలానాలు పవిత్ర రంజాన్ మాసం గురించి, ఖురాన్ బోధనలను వివరించారు.

నంద్యాల(రూరల్): మండలంలోని అయ్యలూరు, చాబోలు, చాపిరేవుల, పోలూరు, భీమవరం, కొత్తపల్లె, ఊడుమాల్పురం, పెద్దకొట్టాల, కానాల, వైఎస్సార్‌నగర్, నందమూరినగర్‌లలో ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గోస్పాడు: మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరించి ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.పలు మసీదుల్లో ఖాజీలు రంజాన్ సందేశం ఇచ్చారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆళ్లగడ్డ: రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా శనివారం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుకున్నారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఈద్గా మైదానాలు అల్లాహుఅక్బర్ నినాదంతో మార్మోగాయి. శనివారం ముస్లింలు ఉదయం నుంచే ఈద్గాల వద్దకు చేరుకుని వివిధ గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలో ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి నూరాని, జామియా మసీదుల నుంచి ర్యాలీగా కుందూ నది ఒడ్డునున్న ఈద్గా వద్దకు చేరుకున్నారు. మత గురువు షంషుద్దీన్ ఈదుల్‌పితర్ నమాజ్ చేయించారు. రంజాన్ పండుగ, ప్రవక్త సందేశాన్ని క్లుప్తంగా వినిపించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


ఉయ్యాలవాడలో ఈద్గా వద్ద ఖురాన్ సందేశాన్ని వినిపిస్తున్న మత గురువు

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు నర్సాపురం,ఆలమూరు, చిన్నకంబలూరు,పెద్దకంబలూరు,ముత్తలూరు,ఎల్లావత్తుల తదితర గ్రామాల్లో శనివారం ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరి రోజున దీక్షలు విరమించి ఆయా గ్రామాల్లోని మసీదుల నుంచి ర్యాలీగా అల్లాహ్‌ను స్మరిస్తూ గ్రామ శివారుల్లో ఉన్న ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


రుద్రవరంలో ఈద్గా వద్దకు వెళ్తున్న దృశ్యం

పండుగను పురస్కరించుకొని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని కాంట్రాక్టర్ నజీర్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యన ముస్లింలకు పండుగ శుభాకాంలలు తెలియజేశారు.

శిరివెళ్ల: మండలంలో శనివారం ఘనంగా రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, మహదేవపురం, కామినేనిపల్లె, కోటపాడు గుంప్రమాన్‌దిన్నె, జీనేపల్లెలో ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.


చిన్నారికి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి


దొర్నిపాడులో రంజాన్ ప్రత్యేకతను వివరిస్తున్న మతగురువు


చాపిరేవులలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

దొర్నిపాడు: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. చాకరాజువేముల, దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల, డబ్ల్యూ గోవిందిన్నె, బుర్రారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వేకువజాము నుంచే ఉపవాస దీక్షలు విరమించి నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనల అనంతరం ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహానికి తుది మెరుగులు దిద్దాలి


విగ్రహం వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణ సమీపంలోని పొన్నాపురం కాలనీలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహం పిచ్చిమొక్కల మధ్య కళా విహీనంగా ఉందని, మే 21 ఆయన వర్ధంతి సమయానికి తుది మెరుగులు దిద్దాలని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలమోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య కోరారు. శనివారం పార్టీ నాయకులు విగ్రహ పరిసరాలను పరిశీలించి పిచ్చి మొక్కలు తొలగించారు. ఊకొట్టు వాసు, ఎస్‌వైడీ ప్రసాద్, మస్తాన్‌ఖాన్, బాలకృష్ణ, సలాం పాల్గొన్నారు.

మద్దిలేటయ్య క్షేత్రంలో భక్తుల సందడి


నరసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తుల సందడి నెలకొంది. ఉభయ కర్నూలు జిల్లాతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి, వరపూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.7,13,433 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన గోపాల్‌రెడ్డి, శకుంతల దంపతులు స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1,00,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

నేడు అష్టావధానం

కర్నూలు కల్చరల్: భావనా ప్రియ సాహిత్య బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ కవి, దంత వైద్య విద్యార్థి బోరెల్లి హర్ష అష్టావధానం నిర్వహిస్తారని నిర్వాహకులు డాక్టర్ సంజీవరాయుడు, శ్రీనివాసులు తెలిపారు. శతావధాని డాక్టర్ వారణాసి శివరామకృష్ణ సంచాలకులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అవధాని గంగుల ధర్మరాజు, హనుమంతప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, అవళూరు సీతమ్మ, కె.వె. సుబ్బలక్ష్మి, దండెబోయిన పార్వతీ దేవి, వెంకటలక్ష్మి, ఇనాయతుల్లా పృచ్ఛకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

చెత్తకుప్పలో శిశువు మృతదేహం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్ వద్ద చెత్తకుప్పలో శనివారం ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. సాయిబాబానగర్ వద్దనున్న చెత్తకుప్పలో ఆడశిశువు మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించి విషయాన్ని ఐసీడీఎస్ అధికారులకు తెలియజేయగా వారు శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముంచిన గాలి వాన

- 600 ఎకరాల్లో నేలవాలిన వరి పైరు


పెద్దకంబలూరు వద్ద నేల వాలిన వరి పైరును చూపుతున్న రైతులు

రుద్రవరం: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లారే వరకు వీచిన గాలి, కురిసిన వాన రైతన్నను నిలువునా ముంచింది. పంటకాలం పూర్తి అయ్యింది. ఓ వైపు కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. నేడో మాపో దిగుబడులు చేతికందుతాయని రైతులు ఎన్నో ఆశలతో ఉన్నారు. వారి ఆశలను నీరు గార్చుతూ గాలి వాన బీభత్సం సృష్టించింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు రబీ సీజన్‌లో దాదాపు ఆరువేల హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. పంట కాలం పూర్తి అయ్యింది. కోతలు మొదలయ్యాయి. వచ్చిన వరి ధాన్యాన్ని పసిమి ఉండగానే ఒక్కో బస్తా (75కేజీలు) దాదాపు రూ.1650 ప్రకారం విక్రయించుకుంటున్నారు. దిగుబడులు కూడా ఒక్కో ఎకరానికి 40 బస్తాలకు మించి వస్తుండటంతో పెట్టుబడులు పోనూ మంచి లాభాలు వస్తాయని రైతులు సంతోషంగా ఉన్నారు. ఈ సమయంలో ఉన్న ఫలంగా అకాల వర్షం కురవడంతో గింజలు రాలి వరి పంట అంతా నేల వాలింది. ఇది వరకే కోతలు కోయించి కుప్పలుగా పోసిన ధాన్యం తడిసి ముద్ద అయ్యింది. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. నిలువుగా ఉన్న వరి పంట కోత కోసేందుకు ఎకరాకు రూ.2500 ఖర్చయ్యేది. పంట నేల వాలడంతో ఎకరాకు రూ.6వేలకు పైగా ఖర్చవుతుందని, దిగుబడి కూడా 30 సంచులకు మించదని వాపోతున్నారు. ప్రధానంగా చిన్నకంబలూరు,పెద్దకంబలూరు, అప్పనపల్లె, డి.కొట్టాల,ఎల్లావత్తుల తదితర గ్రామాల వైపు దాదాపు 600 ఎకరాల్లో పంట నేల పాలు కావడంతో భారీ నష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిరివెళ్ల: అకాల వర్షాలతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. పంట చేతి కొచ్చిన సమయంలో వర్షం కురిసి వారికి నష్టం కలిగించింది. మండలంలో శుక్రవారం రాత్రి నుంచి గాలులు, ఉరుములతో వర్షం పడింది. గత వారం నుంచి మండలంలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 65 శాతం కోతలు పూర్తియయ్యాయి. మెజార్టీ రైతులు పంటను రైతులు కల్లంలోనే అమ్ముకుంటున్నారు. మరి కొందరు ధాన్యంను ఆర బెట్టుకుంటున్నారు. ఈదురు గాలులకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కానుక చెట్టు విరిగి పడింది. దీంతో మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించి అర్ధరాత్రి 2 గంటల తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


అప్పనపల్లె వద్ద ధాన్యం కుప్పలపై పట్టలు కప్పుతున్న దృశ్యం


శిరివెళ్ల వద్ద కల్లంలో ఆరబోసిన వరి ధాన్యం

నంద్యాల అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

- మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- వచ్చే విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు
- నిర్మాణాలను అడ్డుకునేందుకు టీడీపీ యత్నం
- సుప్రీంకోర్టులోనూ ఆ పార్టీకి చుక్కెదురు
- మెడికల్ కళాశాల, అభివృద్ధి పనులపై ఎల్లో మీడియా తప్పుడు రాతలు
- ఎమ్మెల్యే శిల్పా రవి


సుప్రీంకోర్టు తీర్పు ప్రతిని చూపుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: ఎవరు ఎన్ని కుట్రలు చేసినా..నంద్యాల అభివృద్ధిని అడ్డుకోలేరని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాలకు మెడికల్ కళాశాల మంజూరైతే ఎవరైనా ఆనందిస్తారని, కానీ ఇక్కడి టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన 50 ఎకరాల్లో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తుంటే ఆ పార్టీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని తీవ్రంగా ప్రయత్నించారు. అయితే ఆర్ఏఆర్ఎస్ భూముల్లో నిర్మాణాలు కొనసాగించవచ్చని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో, ఎలాగైనా అడ్డుకోవాలనే ఉద్దేశంతో మళ్లీ ఇదే నాయకులు సుప్రీంకోర్టుకు సైతం వెళ్లారని, అక్కడ కూడా వీరికి ఎదురు దెబ్బ తగిలిందని, హైకోర్టు తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో నంద్యాల మెడికల్ కళాశాలకు 150 ఎంబీబీఎస్ సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఎల్లో మీడియా మాత్రం వచ్చే విద్యాసంవత్సరానికి కళాశాల పూర్తి కాదు, అడ్మిషన్లు సైతం ఉండవని తప్పుడు వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి మెడికల్ కళాశాల పనులు పూర్తి కావాలని ఖర్చుకు రాజీ పడకుండా పనులు చేస్తుంటే సహకరించాల్సి పోయి అభివృద్ధికి అడ్డు తగిలే వారా.. నాయకులు అంటూ ప్రశ్నించారు. సొంత ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే స్వాగతించాల్సింది పోయి సైంధవుడిలా అడ్డు తగలడం చూస్తే వారి విధానం ఏంటో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రతి అభివృద్ధి పనిని కోర్టుల ద్వారా స్టే తెచ్చి అలవాటుగా మారందని అసహనం వ్యక్తం చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో మెడికల్ అడ్మిషన్లు నిర్వహించుకోవచ్చని, ఎన్ఎంసీ అనుమతులు కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టులో మెడికల్ కళాశాలకు అనుకూలంగా తీర్పు రావడం నంద్యాల ప్రజల విజయమని, ఎప్పుడైనా న్యాయమే గెలుస్తుందన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాటలు నిజమయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి అందించిన సాయానికి నంద్యాల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

న్యాయ రాజధానికి మద్దతు ఇవ్వకుండా లోకేష్ పర్యటన..

నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కర్నూలు జిల్లాలో న్యాయ రాజధానిని అడ్డుకొని, పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలుగు పదాలే సరిగా పలకడం రాని లోకేష్, ప్రతి నియోజకవర్గంలో నాయకులను తిట్టుకుంటూ, వివిధ రకాల పేర్లతో సంభోదించడం మినహా చేసిందేమీ లేదన్నారు. ఎజెండా లేకుండా సాగుతున్న ఏకైక పాదయాత్ర ఇదేనేమోనని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్, రమణ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

29న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు గ్రామంలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ. 25వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 20వేలు, రూ.15వేలు అందజేస్తామన్నారు. అదేవిధంగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన బృందాలకు వరురూ. 10వేలు, రూ. 5వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

మద్దిలేటిస్వామి ఆలయ ధ్వజ స్తంభానికి పూజలు


బేతంచెర్లలో ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో సుమారు రూ. 4 కోట్లతో చేపట్టిన పునర్నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఆలయం ముందు నూతనంగా ధ్వజస్థంభ ప్రతిష్ఠకు ఓర్వకల్లు మండలం, కొంతలపాడు గ్రామానికి చెందిన మద్దయ్య రూ. 4.50 లక్షలు విరాళం ఇచ్చారు. గుంటూరు జిల్లా, చెరుకుపల్లె నుంచి 57 అడుగుల టేకు ధ్వజస్థంభాన్ని శనివారం బేతంచెర్ల మీదుగా ఆలయానికి తరలించారు. ఈ మేరకు ధ్వజస్థంభానికి విశ్వహిందూ పరితషత్, హిందూ సోదరులు, ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, వేదపండితులు జ్వాలాచక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడుమద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్ నాయకులు చంద్రారెడ్డి, విశ్వహిందూ పరిషత్, సమరసతా సేవా ఫౌండేషన్ కమిటీ సభ్యులు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మల్లు హుసేన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో పెద్ద ప్రమాదంతప్పింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు గ్యాస్ సిలిండర్లలోడుతో వెళ్తున్న లారీకి ఘాట్ రోడ్డులోని చింతమాను టర్నింగ్ వద్ద బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కొండచరియను ఢీకొట్టింది. అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు కారులో విజయవాడ నుంచి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు.